క్లుప్తంగా

ఘనంగా ముగిసిన తిరుకల్యాణోత్సవాలు



పల్లకీలో స్వామివారి ఊరేగింపు

అవుకు: పట్టణంలో భూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి తిరుకల్యాణోత్సవాలు శనివారం ముగిశాయి. ఎనిమిది రోజులుగా అంగరంగ వైభవంగా ఉత్సవాలు జరిగాయి. చివరి రోజు తీర్థవాది, ధ్వజావరోహణం అనంతరం వసంతోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి, ఉత్సవ మూర్తులను పల్లకీలో ఆలయం నుంచి తేరువీధి, రాజా వీధి మీదుగా మండపం వీధికి అక్కడి నుంచి తిరిగి ఆలయానికి ఊరేగింపు నిర్వహించారు. స్వామివారికి భక్తులు కాయా కర్పూరం సమర్పించారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన కేంద్రాలు



క్విజ్ పోటీలకు హాజరైన విద్యార్థులు

బేతంచెర్ల: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని.. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి మధుశేఖర్ అన్నారు. శనివారం పట్టణంలోని గ్రంథాలయంలో సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా ఉపాధ్యాయురాలు కృష్ణ ప్రియ విద్యార్థులకు క్విజ్, ఆటల పోటీలు నిర్వహించారు. వేసవి కాలంలో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయాలను సందర్శించి విజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు.

సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ప్యాపిలి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న పది పరీక్ష పత్రాలు

ప్యాపిలి: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు ఎంఈఓ వెంకటేశ్ నాయక్ తెలిపారు. శనివారం ప్యాపిలి పోలీస్‌స్టేషన్‌కు పరీక్ష పత్రాలు చేరుకున్నాయి. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పది పరీక్ష కేంద్రాన్ని ఎంఈఓ పరిశీలించారు. ఈ నెల 19వ తేదీ నుంచి 28 తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. తెలుగులో 25 మంది, హిందీలో 13 మంది, ఇంగ్లీష్‌లో 23 మంది, గణితంలో 113 మంది, సైన్సులో 72 మంది, సోషల్‌లో 52 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వెల్లడించారు.

ఆర్థిక సాయం



అంత్యక్రియల నిమిత్తం నగదు అందజేస్తున్న ఈఓ

బనగానపల్లె రూరల్: స్థానిక గ్రామ పంచాయతీలో కాంట్రాక్టు వర్కర్‌గా పనిచేస్తున్న కె ప్రతాప్ రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. శనివారం పంచాయతీ ఈఓ సతీష్‌కుమార్‌రెడ్డి మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.10వేల ఆర్థిక సాయం చేశారు.

సోలార్ ప్యానల్స్‌తో విద్యుత్ బిల్లు ఆదా



మాట్లాడుతున్న విద్యుత్ ఏడీ మధుసూదన్‌రెడ్డి

బేతంచెర్ల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లును ఆదా చేయవచ్చని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి బషీరున్నిసా బేగం, విద్యుత్ ఏడీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం కమిషనర్ హరిప్రసాద్‌తో కలిసి గ్రామ సచివాలయ సిబ్బంది, విద్యుత్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రజలు సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసుకునేలా వారిని ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

క్రమశిక్షణ ముఖ్యం

సంజామల: విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ ఉంటే ఉన్నత స్థాయికి చేరుకోగలరని గిద్దలూరు పుస్తక సంక్షిప్త కేంద్రం నిర్వాహకుడు టి.మద్దిలేటి అన్నారు. గిద్దలూరు గ్రామంలోని పుస్తక నిక్షిప్త కేంద్రంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ కాపీ రైటింగ్, కథల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు.

పంట వ్యర్థాలకు నిప్పు.. సాగుకు ముప్పు

- లాభం కన్నా నష్టమే ఎక్కువంటున్న వ్యవసాయాధికారులు
- మిత్ర కీటకాలు, శిలీంద్రాలు చనిపోయే ప్రమాదం
- పంటసాగు, దిగుబడిపై తీవ్ర ప్రభావం
- కుళ్ల బెడితే సేంద్రియ ఎరువుగా ఉపయోగం



గిద్దలూరు గ్రామంలో కాల్చివేస్తున్న మొక్కజొన్న వ్యర్థాలు

సంజామల: రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను కోతల అనంతరం మిగిలిన వ్యర్థాలకు రైతులు నిప్పు పెడుతున్నారు. వరి, మొక్కజొన్న, పచ్చ జొన్న, కొర్ర, కంది తదితర పంటలను యంత్రాల ద్వారా నూర్పిడి చేస్తున్నారు. మిగిలిన వ్యర్థాలను తొలగించడానికి కూలీల ఖర్చు అధికం అవుతుందన్న కారణంగా నిప్పు పెడుతుంటారు. నిప్పు పెట్టడం ద్వారా భూమిలోని సారం తగ్గిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వేడి వల్ల భూమిలో ఉన్న మిత్ర కీటకాలు, శిలీంద్రాలు చనిపోయి పైరుకు నష్టం కలిగిస్తుంది. భూమి మొద్దుబారి, తేమ శాతం, మొలక శాతం తగ్గిపోయే ప్రమాదం ఉంది. లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉంటుందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు.

నేలకు చేటు

టన్ను గడ్డిని తగలబెట్టడం వల్ల నేలలో 5.5 కిలోల నత్రజని, 2.8 కిలోల పాస్పరస్, 2.5 కిలోల పొటాషియం, కిలో సల్ఫర్‌తో పాటు నేలలో ఉండే సేంద్రియ కర్బనాన్ని కూడా కోల్పోతుంది. వ్యర్థాలను కాల్చడం ద్వారా మీటరు లోతు వరకు వేడి వెళ్తుంది. ఒకేపంక్క మండే ఎండలకు తోడు పొలాల్లో మంటలు మరింత కాక పుట్టిస్తున్నాయి. ఇవే ఒక్కోసారి ప్రమాదాలకు దారితీస్తున్నాయి. కొంతమంది రైతులు అవగాహన రాహిత్యంతో పొలాల్లో మిగిలిన గడ్డికి నిప్పు పెడుతుండడం పరిసర రైతులకు శాపంగా మారుతోంది. ఒక పొలంలో పెట్టిన నిప్పు సమీప పొలాలకు వ్యాపిస్తుండడంతో ఆ పొలాలు, చేల గట్టుపై నిల్వ చేసిన ధాన్యం రాశులకు నిప్పు ఎక్కడ అంటుకుంటుందోనని ఆందోళన నెలకొంటోంది. వేడి, దూళి, పొగ వల్ల పర్యావరణానికి కూడా హాని కలిగే అవకాశం ఉంది.

పచ్చదనం కనుమరుగు

కొందరి అనాలోచిత చర్యలతో రహదారి పక్కన ఉన్న మొక్కలూ దగ్ధమవుతున్నాయి. పొలాల్లోని వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో విలువైన మొక్కలు బుగ్గిపాలవుతున్నాయి.

ఏటా మొక్కలు నాటుతున్నా సంరక్షణ లేక కొన్ని చనిపోతున్నాయి. మంటలతో మరికొన్ని మొక్కలు కాలిపోవడంతో పచ్చదనం కనుమరుగవుతోంది. పొలాల్లోని వ్యర్థాలకు నిప్పు పెట్టకుండా కుళ్ల బెడితే సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

ప్రత్యామ్నాయ మార్గాలు..ఉపయోగాలు

- పొలంలో మిగిలిన గడ్డిని కంపోస్ట్ చేయడం వల్ల సేంద్రియ ఎరువుగా మారుతుంది.
- సేంద్రియ ఎరువుల వినియోగం పర్యావరణ హితమైనవే కాకుండా సాగు ఖర్చును తగించుకోవచ్చు.
- వరి గడ్డి పుట్టగొడుగుల పెంపకంలో బెడ్డింగ్ మెటీరియల్‌గా ఉపయోగపడుతుంది.
- వ్యర్థాలను కాలిస్తే కాలుష్యంగా మురుతుంది. అదే దున్నితే భూమికి సారవంతంగా మారుతుంది.

వ్యర్థాలను పొలంలోనే దున్నడం ఉత్తమం



పంట తర్వాత మిగిలిన వ్యర్థాలను కాల్చకుండా దున్నితే భూమికి సారం పెరుగుంది. తగలబెడితే భూమిలో తేమ శాతం తగ్గి తర్వాత వేసే పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. పంటకు మేలు చేసే మిత్ర పురుగులు నాశనం అవుతాయి. దీని వల్ల మేలు కన్నా నష్టమే ఎక్కువగా జరుగుతుంది. ఏ పంట వేసిన వ్యర్థాలను భూమిలో దున్నె మార్గం ఉత్తమం. ఇలా చేయడం ద్వారా భూమికి సారం పెరిగి పెట్టుబడి తగ్గే అవకాశం ఉంది. రైతులు పొలాల్లో గడ్డిని తగ్గలబెట్టవద్దు.

–సుధాకర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి, సంజామల

20న బండలాగుడు పోటీలు

ప్యాపిలి: మండల పరిధిలోని బావిపల్లి గ్రామంలో ఈ నెల 20వ తేదీ బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ. 15 వేలు, రూ.10 వేలతో పాటు మొత్తం 12 బహుమతులు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్నవారు 6305427212, 6304108994 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌కు మెమో జారీ

ప్యాపిలి: మండల పరిధిలోని వెంగళాంపల్లిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఫీల్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్న రమేష్‌కు మెమో ఇచ్చినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను సోమ, మంగళ, బుధవారాల్లో ఏపీఓ శ్రీవిద్యతో పాటు టీఏలు పరిశీలించారన్నారు. అయితే సోమవారం 400 మంది కూలీలు హాజరు కాగా మంగళ, బుధవారాల్లో 275 మంది మాత్రమే పనులకు హాజరైనట్లు గుర్తించినట్లు తెలిపారు. కానీ మస్టర్లలో మాత్రం కూలీలు పనికి హాజరు కాకపోయినా హాజరైనట్లు నమోదు చేసి కూలీల నుంచి రూ.200 చొప్పున వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. ఈ మేరకు నోటీసు అందిన రెండు రోజుల్లో రాతపూర్వకంగా సంజాయిషీ ఇవ్వాల్సిందిగా ఫీల్డు అసిస్టెంట్‌ను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

- దనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి అరెస్టు అక్రమం
- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని.. కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తోందని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విమర్శించారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. లిక్కర్ వ్యవహారంలో ఇంత వరకు ఎలాంటి ఆధారాలు లేనప్పటికీ మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, మాజీ ప్రభుత్వ అధికారి కృష్ణమోహన్‌రెడ్డిలను అరెస్టు చేయడం అక్రమమని అన్నారు. కూటమి నాయకులు సూపర్‌సిక్స్ హామీలతో అమలు చేయకుండా ప్రజల దృష్టిని మరల్చేందుకు ఇలాంటి డ్రామాలు ఆడుతున్నట్లు ఆరోపించారు. అక్రమ మద్యానికి చంద్రబాబు ఆద్యుడన్నారు. కూటమి నాయకులు మద్యం పాలసీలో భారీ వసూళ్లకు పాల్పడుతున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఎలాంటి ఆధారులు లేనప్పటికీ వైఎస్సార్‌సీపీ నాయకులు, ఉన్నతాధికారులపై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని మండిపడ్డారు. రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు స్కిల్‌స్కాం జరిగిందన్నారు. ప్రస్తుత కూటమి పాలనలో ఎక్కడ చూసినా ఆ పార్టీల నాయకులు అక్రమంగా గ్రావెల్, గనుల తవ్వకాలు, వక్ఫ్‌బోర్డు, మాన్యం భూముల ఆక్రమణ, ఏ పనికైనా వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న అధికారులు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, నాయకులు గుండం సూర్యప్రకాష్‌రెడ్డి, సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, అబ్దుల్ ఖైర్, జిల్లెల శంకర్‌రెడ్డి, అంబటి రవికుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వివాహ వేడుకల్లో మాజీ మంత్రి బుగ్గన



వెంకటాపురంలో వివాహానికి హాజరైన బుగ్గన

డోన్: మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి శనివారం డోన్ మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన శుభ కార్యాలయాలకు హాజరయ్యారు. పాతబుగ్గ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఆలా రామకృష్ణ కుమారుడు, వెంకటాపురం గ్రామంలో పెద్దయ్య కుమారుడి వివాహాలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వెంకటనాయునిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పట్టణంలో డాక్టర్ సుంకన్న నిర్మించిన యశోద మల్టీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిని సందర్శించారు. మాజీ మంత్రి వెంట మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కౌన్సిలర్లు మహేశ్వరెడ్డి, ఆర్ట్ రమణ, పార్టీ నాయకులు మల్లికార్జునరెడ్డి, మల్లెంపల్లె రామచంద్రుడు, నాగభూషణంరెడ్డి తదితరులు ఉన్నారు.

యువకుడు దుర్మరణం

డోన్ టౌన్: పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చిగురమానుపేటకు చెందిన మణిధర్ కుమారుడు జానీ(24) మృతి చెందాడు. వర్షం కురుస్తున్న సమయంలో బైక్‌పై ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వెళుతుండగా అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు బలమైన గాయాలయ్యాయి. ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందాడు. పట్టణ పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

బేతంచెర్ల: పట్టణంలోని కోటపేట కాలనీకి చెందిన లారీ డ్రైవర్ నూర్ బాషా (38) శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బేతంచెర్ల సీఐటీయూ నాయకులు మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. లారీ మోటర్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మృతుడి భార్య నూరీన్ బీకి రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. సీఐటీయూ నాయకులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో సతమతం



ఆకుమల్లలో తడిచిన మొక్కజొన్నలు

సంజామల: అకాల వర్షాలతో రైతులు సతమతం అవుతున్నారు. కొద్ది రోజులుగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండి సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. మండల పరిధిలోని ఆకుమల్ల, ఆల్వకొండ, ముక్కమల్ల తదితర గ్రామాల్లో శుక్రవారం అర్ధరాత్రి వాన బీభత్సం సృష్టించింది. కళ్లాల్లో ఉన్న మొక్కజొన్న, పొగాకు తదితర పంటలు తడిచిపోయాయి. రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కోవెలకుంట్ల: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని.. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ వరప్రసాదరావు, డిప్యూటీ ఎంపీడీఓ ప్రకాష్‌నాయుడు అన్నారు. స్వచ్ఛ ఆంధ్రా–స్వర్ణ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండలస్థాయి అధికారుల బృందం శనివారం కోవెలకుంట్లలోని సంతపేటలో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. గ్రామ సచివాలయ సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం వల్ల దోమలు దరిచేరకుండా ఉంటాయన్నారు. దోమల కారణంగానే వివిధ రకాల విషజ్వరాలు సోకే ఆస్కారం ఉందన్నారు. అలాగే పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడు రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు.



బేతంచెర్ల సచివాలయం-4 ఆవరణలో మొక్కలు నాటుతున్న సిబ్బంది

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

బేతంచెర్ల: వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని మండల ప్రత్యేక అధికారి బషీరున్నిసా బేగం, తహసీల్దార్ ప్రకాశ్‌బాబు, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ అన్నారు. శనివారం నగర పంచాయతీ కార్యాలయం నుంచి పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. తడి చెత్త, పొడి చెత్త వేరుచేసే ప్రక్రియపై అవగాహన కల్పించారు. అనంతరం నాల్గో సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కమిషనర్ హరి ప్రసాద్, డీటీ మారుతి, వైద్యులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సచివాలయ సిబ్బంది, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

సంజామలలో అవగాహన ర్యాలీ

సంజామల: పరిసరాల పరిశుభ్రను బాధ్యతగా తీసుకోవాలని తహసీల్దార్ అనిల్ కుమార్ అన్నారు. శనివారం సంజామలలో స్వర్ణ ఆంధ్రా– స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ సాల్మన్, సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజలు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రతి పౌరుడు సహకరించాలన్నారు. రోడ్లపైన చెత్త వేయకూడదని తెలిపారు.

రక్తపోటుతో అనేక అనారోగ్య సమస్యలు

బనగానపల్లె రూరల్: రక్తపోటు కారణంగా అనేక అనార్యోగ సమస్యలు వచ్చే అవకాశం ఉందని.. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు అన్నారు. శనివారం పట్టణంలోని సచివాలయం–5లో ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం ర్యాలీ నిర్వహించారు. రక్తపోటు వల్ల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. ప్రస్తుత ఆధునిక జీవనశైలి వల్ల రక్తపోటు, డయాబెటిస్, గుండె జబ్బులు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. ప్రతి రోజు వ్యాయామం, ధ్యానంతో పాటు సెల్‌ఫోన్ వినియోగం తగ్గించుకోవడం, మద్యపానం ధూమ పానానికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ నాయకులు శివయ్య, గోపాల్ వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, అల్తాఫ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సైనికుల సేవలు వెలకట్టలేనివి



డోన్ గాంధీ సెంటర్‌లో జాతీయ జెండాలతో ర్యాలీ



కొలిమిగుండ్ల: ర్యాలీలో పాల్గొన్న మంత్రి బీసీ

కొలిమిగుండ్ల: దేశ రక్షణ కోసం ప్రాణాలకు తెగించి సైనికులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో కేంద్రం పిలుపు మేరకు దేశ సైనికులకు సంఘీభావం తెలుపుతూ శనివారం స్థానిక ఉన్నత పాఠశాల నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, కూటమి నాయకులుజాతీయ జెండాలు పట్టుకుని తిరంగా ర్యాలీ చేపట్టారు. బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. పాకిస్తాన్ ఉగ్రవాదులు పర్యాటకుల మతాన్ని అడిగి దారుణంగా కాల్పులు జరిపారన్నారు. సరిహద్దులో సైన్యం నిరంతరం గస్తీ చేస్తూ దేశరక్షణ కోసం పోరాడుతుతోందని కొనియాడారు. అసువులు బాసిన అమర జవానుల త్యాగాలు దేశ ప్రజలు ఎప్పటికి గుర్తుపెట్టుకుంటారని చెప్పారు.

నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలి

స్థానిక స్టేట్ బ్యాంక్ సమీపంలోని 544–డీ జాతీయ రహదారిపై వర్షపునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి బీసీ ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించారు. ర్యాలీ అనంతరం వర్షపునీరు నిల్వ చేరే రోడ్డును అధికారులతో కలిసి పరిశీలించారు. రోడ్డు ఎత్తు పెంచి నీరు వెళ్లేందుకు కాల్వ ఏర్పాటు చేయాలన్నారు.

తిరంగా యాత్ర

డోన్ టౌన్: ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో సైనిక దళాలకు మద్దతుగా శనివారం డోన్‌లో కూటమి నాయకులు జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, బీజేపీ, జనసేనా నాయకులు, స్థానికులు, అధికారులు ర్యాలీలో పాల్గొన్నారు. సరిహద్దులో సైనికులు తమ ప్రాణాలను పనంగా పెట్టి దేశాన్ని రక్షించారని కొనియాడారు. వారికి సెల్యూట్ చేశారు. జవాన్ మురళీనాయక్ మృతికి సంతాపం తెలిపారు. ఆర్డీఓ నరసింహులు, తహసీల్దార్ నాగమణి, సీఐ ఇంతియాజ్‌బాషా పాల్గొన్నారు.

‘బండలాగుడు’ విజేత సంజామల వృషభాలు



రాతిదూలం లాగుతున్న వృషభాలు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పాలపండ్ల విభాగంలో ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లోని వివిధ జిల్లాలకు చెందిన 20 జతల వృషభాలు పోటీల్లో పాల్గొన్నాయి. సంజామల మండలం ముక్కమల్లకు చెందిన ముసాని చంద్రశేఖర్‌రెడ్డి వృషభాలు నిర్ణీత 15 నిమిషాల వ్యవధిలో 3,110 అడుగుల దూరం లాగి ప్రథమస్థానంలో రూ.60 వేలు కైవసం చేసుకున్నాయి. గుంటూరు జిల్లా కొల్లపారకు చెందిన మాధవరెడ్డి వృషభాలు 3064.8 అడుగుల దూరంతో రెండో స్థానంలో రూ. 50 వేలు, ఇదే జిల్లా సంతమాగులూరు తేజశ్రీరెడ్డి వృషభాలు 3045.2 అడుగుల దూరంతో మూడో స్థానంలో రూ. 40 వేలు, దొర్నిపాడు బత్తుల కృష్ణయ్య యాదవ్ 2950 అడుగుల దూరం లాగి నాల్గో స్థానంలో రూ. 30 వేలు దక్కించుకున్నాయి. ఉయ్యాలవాడ మండలం నర్సిపల్లెకు చెందిన ఉప్పరి లక్ష్మీదేవి వృషభాలు 2789.4 అడుగుల దూరంతో ఐదో స్థానంలో రూ. 20 వేలు, గడవేముల మండలం గడియరేవులకు చెందిన సంజయ్‌కుమార్ వృషభాలు 2331.8 అడుగుల దూరంతో ఆరో స్థానంలో రూ. 15వేలు, తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా ఈడిగవానిపల్లెకు చెందిన వంశీకృష్ణ వృషభాలు ఏడో స్థానంలో రూ. 10 వేలు, ఇదే జిల్లా వెంకటాపురానికి చెందిన వంశీకృష్ణ వృషభాలు ఎనిమిదో స్థానంలో రూ. 5 వేలు గెలుపొందాయి.

రెడ్‌క్రాస్ నూతన కమిటీ

డోన్ టౌన్: సమాజంలో రెడ్‌క్రాస్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని.. సేవలను మరింత విస్తృత పరుస్తామని తహసీల్దార్, రెడ్‌క్రాస్ గౌరవాధ్యక్షురాలు నాగమణి అన్నారు. రెడ్‌క్రాస్ డోన్ మండల నూతన కమిటీ ఎన్నిక శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి, జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగసురేంద్ర హాజరయ్యారు. కమిటీ చైర్మన్‌గా కొచ్చెర్వు వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా ఖాజా హుస్సేన్ బాషా, కోశాధికారిగా మల్లికార్జున, గౌరవ సలహాదారులుగా బాలసుబ్బయ్య, కృష్ణమూర్తి, కార్యవర్గ సభ్యులుగా ఆంథోని మేరి, మహ్మద్‌రఫీ, రమణయ్య, రంగస్వామి, చంద్రశేఖర్, విష్ణు, గురునాథ్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం బుడగ జంగాల కాలనీ వాసులకు తహసీల్దార్ చేతుల మీదుగా బెడ్‌షీట్లు, టార్పాలిన్లు అందజేశారు.



నూతన కమిటీని సత్కరిస్తున్న సభ్యులు

వేడుకగా విగ్రహ ప్రతిష్టాపన



స్వామివారిని దర్శించుకుంటున్న ఎంపీపీ, భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని ముద్దవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పాలుట్ల రంగస్వామి, ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. వేద మంత్రాలు, హోమాలు, యంత్ర ప్రతిష్ట , భక్త జనసందోహం, గోవింద నామస్మరణ నడుమ విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ట గావించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి, జాకీర్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారికి పట్టువస్త్రాలతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్న తిమ్మయ్య, నాయకులు బుగ్గన కుమార్ రెడ్డి, తిమ్మగురుడు, మనోహర్ నాయుడు, మద్దిలేటి, రామకృష్ణ పాల్గొన్నారు.



పాలుట్ల రంగస్వామి

చెడు అలవాట్లకు దూరంగా ఉంటేనే ఆరోగ్యం



బీపీ పరీక్షలు చేస్తున్న డాక్టర్ కెన్నెడి

కోవెలకుంట్ల: చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రిన్సిపాల్ వేణుగోపాల్, మాయలూరు పీహెచ్‌సీ డాక్టర్ రాబర్ట్ కెన్నెడి అన్నారు. పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అధిక రక్తపోటు వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంచి ఆహారం, అలవాట్లు, జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల హైబీపీతో బాధపడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోందన్నారు. దీని నివారణకు ఆహార పదార్థాల్లో ఉప్పును కనీసం పదిశాతం తగ్గించాలని పేర్కొన్నారు. జీవన శైలిని చక్కదిద్దుకుని సరైన పోషకాహారం తీసుకోవడంతోపాటు వ్యాయామం చేయడం వల్ల బీపీని నియంత్రించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, నరేంద్రనాథరెడ్డి, హెల్త్‌సూపర్‌వైజర్ మునిస్వామి పాల్గొన్నారు.